# నేటి నుంచి ఉపాధ్యాయుల నిరసన

ఖైరతాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడంతో పాటు డీఏ, పీఆర్సీలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. తెలంగాణ ఉపాధ్యాయ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్ హైదరాబాద్ కార్యవర్గం

సంఘం(తపస్) హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాల కార్యాచరణ పోస్టర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.తిరుపతిరెడ్డి, జి.వీరేష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సంవత్సరం గడుస్తున్నా అమలు పరచకపోవడం తీవ్ర నిరాశకు గురి చేస్తుందన్నారు. జీపీఎఫ్, మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ బిల్లులు, జీతాల సప్లిమెంటరీ బిల్లులు తదితర ఏరియర్స్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్టు ప్రకటించారు. అక్టోబరు 28న అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తామని, నవంబరు 5న జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, నవంబరు 23న ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష ఉంటుందని తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రతినిధులు ఉషారాణి, లక్ష్మీనారాయణ, దామోదర్ పాల్గొన్నారు.

# జేఎన్ఏఎఫ్ఏయూకి స్థలం కేటాయించొద్దు



అంబేడ్కర్ వర్సిటీలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జేఎన్ఏఎఫ్ఏయూకు అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని కేటాయించొద్దంటూ డా.బి.ఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సోమవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఫ్‌యూ) కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకునేవరకు దశలవారీగా తమ పోరాటం కొనసాగుతుందని జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్ గౌడ్, డా.వై. వెంకటేశ్వర్లు, రుశేంద్ర మణి, అధ్యాపకేతర ఉద్యోగులు సంఘం నేతలు ఎండీ హబీబుద్దిన్, షబ్బీర్, డా.యాకేష్ దైద, డా.అవినాష్, డా.రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పవర్ పాలిటిక్స్‌పై బీసీల్లో చైతన్యం కల్పిద్దాం

ఖైరతాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీలకు దక్కాల్సిన అభివృద్ధి, ఆత్మగౌరవం కేవలం రాజ్యాధికారం తోనే సాధ్యమవుతుందని బీసీ కులాల ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు నరహరి పేర్కొన్నారు. సోమవారం లక్డీకాపూల్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో బీసీకుల సంఘాల ప్రతినిధులతో సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు నరహరి

నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీల చైతన్యం, రాజ్యాధికార ప్రయత్నాలపై చర్చించినట్టు నరహరి తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన పాండు యాదవ్ మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా ఉద్యమిస్తేనే అన్నింటినీ సాధించుకోగలమన్నారు. బీసీ ప్రముఖులు డాక్టర్ వినయ్ కుమార్, యర్ర సత్యనారాయణ, డి.శంకర్, అక్కల బాబూ గౌడ్, జగన్‌మోహన్ ముదిరాజ్, నిమ్మల వీరన్న, కాశీనాథ్, విజయ్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బంజారాల సంక్షేమానికి కృషి

ఎర్రగడ్డ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బంజారాల సంక్షేమానికి కృషి చేస్తామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సభావత్ రాములు నాయక్ అన్నారు. అధ్యక్షుడిగా నియమితులైన రాములు నాయక్‌ను ఎర్రగడ్డ బంజారా



రాములు నాయక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగర్‌లోని ఆయన నివాసంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు మహమ్మద్ మొహసిన్ ఖురేషి, దూడల రవి గౌడ్, నాయకులు మహమ్మద్ సర్దార్, గంటా మల్లేష్, వెంకటస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.

# హైదరాబాద్ రేసర్ అఖిల్ హ్యాట్రిక్ గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ నాలుగో రౌండ్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ జట్టు రేసర్ అఖిల్ అద్భుత ప్రదర్శనతో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కోయంబత్తూర్‌లో జరిగిన ఫార్ములా-4 ఇండియన్ ఓపెన్ నాలుగో రౌండ్ పోటీల్లోని మూడు రేసుల్లోనూ అఖిల్ విజేతగా నిలిచి టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఆఖరి రేసులో అఖిల్ 26 నిమిషాల 16 సెకన్లలో రేసును ముగించి, అగ్రస్థానంలో నిలిచాడు. బెంగళూరు స్పీడ్‌స్టర్స్ రేసర్ జేడెన్ పరియట్ ద్వితీయ స్థానం, రాయల్ బెంగాల్ టైగర్స్ డ్రైవర్ రుహాన్ ఆల్వా తృతీయ స్థానం దక్కించుకున్నారు.




ట్రోఫీతో రేసర్ అఖిల్

# నకిలీ సర్టిఫికెట్లతో మోసం

- డబ్బులు, మూడేళ్ల సమయం వృథా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు

పంజాగుట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమకు నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చారని పలువురు విద్యార్థులు పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడలో అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ మెడికల్ సైన్సెస్ పేరుతో పారామెడికల్, ఒకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. తమ ఇనిస్టిట్యూట్‌లో కోర్సులు నేర్చుకున్న వారు వివిధ సంస్థల్లో ఉపాధి పొందారని, భవిష్యత్తు బాగుంటుందని నిర్వాహకులు నమ్మబలికారు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి అనుబంధంగా తమ ఇనిస్టిట్యూట్ ఉందని, స్వయంగా యూనివర్సిటీనే సర్టిఫికెట్లు ఇస్తుందని చెప్పారు. దీంతో చాలామంది రూ. 60 వేల నుంచి లక్ష రూపాయలు కట్టి పారామెడికల్, ఒకేషనల్ కోర్సులలో చేరారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు సంస్థ ఇచ్చిన సర్టిఫికెట్లతో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోగా, వారు పరిశీలించి, అవి చెల్లవని చెప్పారు. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి గుర్తింపు లేదని తేలడంతో తాము మోసపోయామని గ్రహించిన విద్యార్థులు ఎల్లారెడ్డిగూడలోని ఇనిస్టిట్యూట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బులు, మూడు సంవత్సరాల సమయాన్ని నష్టపోయామని, తమకు న్యాయం చేసి దోషులను శిక్షించాలని పోలీసులను కోరారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఉన్నట్టు తెలిపారు. సాయి యశస్విని అనే విద్యార్థి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డబుల్ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూల్

- వ్యక్తి అరెస్టు, రిమాండ్

బోరబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్ హిల్స్‌కు చెందిన జి.నరసింహ రాజు డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పలు బస్తీల్లో ప్రజలను నమ్మించి రూ.1.04 కోట్లు వసూలు చేసినట్టు పోలీసులు తెలిపారు. డబ్బులు తీసుకొని కొంతకాలంగా తప్పించుకు తిరుగుతున్న నరసింహరాజుపై బాధితుడు రవీందర్‌రెడ్డి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు జి.నరసింహ రాజును అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మహిళా ఉద్యోగులపై అసభ్య ప్రవర్తన

- వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అశ్లీల వీడియోలు చూసి మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. షేక్‌పేట హెల్త్ అండ్ గ్లో సంస్థలో సుమారు 12 మంది మహిళలు పనిచేస్తున్నారు. ఓ వ్యక్తి నల్లటి ద్విచక్రవాహంపై వచ్చి పార్కింగ్‌లో పెట్టి దాని మీద కూర్చొని మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఇలా మరో వ్యాపారం కేంద్రం



భూత్‌కూరి రమేష్

వద్ద కూడా చేయడంతో ఫిర్యాదులు అందుకున్న ఫిలింనగర్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి కరీంనగర్ జిల్లాకు చెందిన భూత్‌కూరి రమేష్ అని తేలింది. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఆరు నెలల క్రితం భార్య చనిపోవడంతో అశ్లీల వీడియోలు చూస్తూ వెకిలి చేష్టలకు పాల్పడ్డాడని తేలింది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బోరబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరి వేసుకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్ఎఫ్ నగరకు చెందిన ఎండీ రైజ్(45) ప్రైవేట్ ఉద్యోగి. చాలీ చాలని జీతంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. చేసిన అప్పులు భారంగా మారడంతో తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## క్రెడిట్ కార్డు ద్వారా రూ. 94 వేలు డ్రా

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

బోరబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి క్రెడిట్ కార్డ్ నుంచి అగంతకులు రూ. 94వేలు డ్రా చేశారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన అబ్దుల్ నదీమ్ క్రెడిట్ కార్డ్ నుంచి ఈనెల 9వతేదిన గుర్తుతెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో రూ.94వేలు డ్రా చేశారు. సెల్‌ఫోన్ మెసేజ్ ఆధారంగా బాధితుడు వెంటనే బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సీవరేజ్, మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

- డివిజన్‌కు రూ. రెండు కోట్లతో ప్రతిపాదనలు
- నియోజకవర్గంలో 30 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే దానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీవరేజ్, మంచినీటి సమస్యను శాశ్వత ప్రాతిపాదకన పరిష్కరించేందుకు ప్రతి డివిజన్‌కు రూ. 2 కోట్లతో అంచనాలు రూపొందిస్తున్నట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో సోమవారం హిమాయత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలకు చెందిన జలమండలి, జీహెచ్ఎంసీ, శానిటేషన్, వెటర్నరీ, వీధి దీపాల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన జలమండలి అధికారులతో మాట్లాడుతూ... సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయనేది గుర్తించి నూతన పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా హిమాయత్‌నగర్ డివిజన్ గాంధీ కుటీర్, విఠల్వార్, షేరిగేట్, పరాగేట్లలో సీవరేజ్‌తో పాటు సీసీ రోడ్ల సమస్యలున్నట్టు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని, సంబంధిత అధికారులు అక్కడ పర్యటించి సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలను చూపించాలన్నారు. పంపీర్నాగా ఫ్లేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. త్వరలోనే తాను అన్ని శాఖల అధికారులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తామన్నారు.

ఈ సందర్భంగా అధికారులు హిమాయత్‌నగర్ డివిజన్‌లో మహేశ్వరి థియేటర్ వద్ద షేరిగేట్లో ఇంజెక్షన్ బోర్వెల్ వేయిస్తే మంచి ఫలితం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు సంబంధించి అధ్యయనం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అన్ని డివిజన్లలో వీధి దీపాల ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, నిధుల లేమి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్పెషల్ బడ్జెట్ కింద వచ్చే డబ్బును దీని కోసం మంజూరు చేస్తామని తెలిపారు. సింగాడికుంట, ఉదయ్ నగర్, అంబేడ్కర్ నగర్, గౌరీశంకర్ కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని ప్రతిపాదనలు రూపొందించాల్సిందిగా ఈఈ విజయ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్, ఈఈ విజయ్‌కుమార్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, రామన్ గౌడ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 30 చోట్ల ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన స్థలాలను గుర్తించడంతో పాటు ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. బస్తీవాసులకు మరింత నాణ్యమైన నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంటు దోహదం చేస్తాయన్నారు.

## అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌ను కలుస్తాం

బంజారాహిల్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాల విషయంలో త్వరలోనే జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలువనున్నట్టు ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. కొంత మంది వాట్సాప్, నకిలీ, యూట్యూబ్ రిపోర్టర్లు అధికారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, ఇప్పటికే వారి జాబితాను తాము సేకరించామని, ఈ జాబితాను సిటీ కమిషనర్‌ను కలిసి అందజేస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సోమవారం ఆయన నివాసంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు తాము ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకుండా నకిలీ రిపోర్టర్లతో దోస్తీ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రిపోర్టర్ల పేరుతో అధికారులను ఎవరైనా బెదిరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే వారిపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. నకిలీ రిపోర్టర్లు బెదిరిస్తే భయపడాల్సిన అవసరం లేదని గతంలో తాను ఇదే అంశాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు.

# హెచ్ఎస్‌బీసీ ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్ మేళా

పంజాగుట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చేతి వృత్తి కళాకారులు, నిరుపేద చేనేత వృత్తి కార్మికులను ఆదుకునేందుకు హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ ప్రతి ఏడాది దీపావళి పండగను పురస్కరించుకొని హెల్పింగ్ హ్యాండ్ మేళాను ఏర్పాటు చేస్తోంది. సోమవారం సోమాజిగూడలోని హెచ్ఎస్‌బీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన మేళాను సినీనటి గీతా భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చేనేతలకు, నిరుద్యోగ యువతకు అండగా నిలవడానికి బ్యాంక్ సిబ్బంది చేస్తున్న కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. బ్యాంకు మేనేజర్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ సౌమ్య, సేల్స్ హెడ్ ప్రవళ్లిక మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా తమ బ్యాంకు అన్ని శాఖల్లో ఈ హెల్పింగ్ హ్యాండ్ మేళాను నిర్వహిస్తోందని, ఇది 22వ మేళా అని తెలిపారు. 3 రోజుల పాటు ఈ మేళా కొనసాగుతుందన్నారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తయారు చేసిన ఉత్పత్తులను తమ బ్యాంక్ వినియోగదారులకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా మేళా నిర్వహించడం ద్వారా వారికి ఆర్థికంగా చేయూత ఇవ్వనున్నట్టు తెలిపారు.



హెల్పింగ్ హ్యాండ్ మేళాను ప్రారంభిస్తున్న సినీనటి గీతా భాస్కర్

# జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు ఘన సన్మానం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు ఉపకులపతులుగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్లను వర్సిటీ ఉద్యోగులు, అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. పాలమూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన జీఎన్.శ్రీనివాస్‌ను వర్సిటీ ఉద్యోగుల సంఘం నేతలు ఘనంగా సన్మానించగా, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ (ఆర్‌జేయూకేటీ) ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొ.గోవర్ధన్‌కు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పూలమొక్కను అందించి సత్కరించారు.



ప్రొ.శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

**● ప్రొ.గోవర్ధన్‌కు అభినందనలు**

కేపీహెచ్‌బీకాలనీ: బాసర ఆర్‌జేయూకేటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను సోమవారం వర్సిటీ జేఏసీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పవన్‌కుమార్, ఉదయ్, తేజ, గోపీనాథ్, శ్రావణ్, శ్రావణి, లిఖిత, ప్రజ్ఞ పాల్గొన్నారు.

**● ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌కు..**

పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్‌ను సోమవారం ఆయన వద్ద పీహెచ్‌డీ చేసిన వారు శాలువాతో సత్కరించి అభినందించారు. డా.జగదీష్‌కుమార్, డా.రాజు, కె.నరేష్, డా.చంద్రమౌళి, సయ్యద్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

# పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణానికి కృషి

బంజారాహిల్స్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేకు కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లోని కమలాపురికాలనీలో పార్కులను ఆయన సోమవారం సందర్శించి పార్కుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఈఈ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కమలాపురి కాలనీలో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

# ఘనంగా గురు రాందాస్ జయంత్యుత్సవాలు

ఎర్రగడ్డ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడా మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం సిక్కులు గురు రామదాస్ జి మహరాజ్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీని నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మెమొరీ ఆఫ్ ఎస్ సదర్ సింగ్ సోది సభ్యులు ఓంకార్ కౌజి, రాగీసింగ్స్ సేవ సభ్యులు ఏబి గోవిందరావు జి, రహమత్ నగర్ సిద్ధి సంగత్ ప్రబంధ కమిటీ గురుద్వారా సాహెబ్ గురు రాందాస్ జి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న నవీన్ యాదవ్ తదితరులు

# పెండింగ్ పనులు చేపట్టాలి



పెండింగ్ పనులు త్వరలో చేపట్టాలని జలమండలి జీఎం హరిశంకర్‌తో సోమవారం సమావేశమైన వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

– బంజారాహిల్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి)

# ఫ్యామిలీ మెడిసిన్‌ను ప్రత్యేక రంగంగా గుర్తించండి

బంజారాహిల్స్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఫ్యామిలీ మెడిసిన్‌ను ప్రత్యేక రంగంగా అధికారికంగా గుర్తించాలని, కమ్యూనిటీ స్థాయిలోనే వ్యాధుల నివారణ, అనారోగ్య సమస్యలకు సమగ్ర వైద్య సేవలను అందించాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి జేపీ నడ్డా, నీతి అయోగ్ అధికారులకు వివరించామని ఆపీ (అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్) అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల వెల్లడించారు. మూడు రోజుల పాటు ఢిల్లీ ఎయిమ్స్‌లో జరిగిన 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ద్వారా నిపుణులు వెల్లడించిన అనేక విషయాలను సోమవారం కలిసి వివరించినట్టు చెప్పారు. ముఖ్యంగా మన దేశంలో కేన్సర్, గుండె నొప్పి కేసులు విస్తృతంగా పెరుగుతున్నందున కేంద్రప్రభుత్వం ప్రివెంటివ్ మెడిసిన్‌పై దృష్టిపెట్టి ప్రజల్లో ఆరోగ్య చైతన్యానికి తక్షణం కృషి చేయాలనేదానిపై తెలియజేసినట్టు చెప్పారు. ఇండియాలో డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని, కేన్సర్ స్క్రీనింగ్, ట్రీట్మెంట్‌తో పాటు పాల్లియేటివ్ కేర్‌ను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరామన్నారు. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి జేపీ నడ్డా, నీతి అయోగ్ బందాన్ని కలిసిన వారిలో ఆపి ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కత్తుల, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ అమిత్ చక్రవర్తి, బీఓటీచైర్ డాక్టర్ సునీల్ ఖాజా, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వాసుసింగ్, గ్లోబల్ మెడికల్ ఎడ్యుకేషన్ చైర్ డాక్టర్ లోకేష్ ఈదర పాల్గొన్నట్టు వెల్లడించారు. ఎయిమ్స్‌లో గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ స్టూడెంట్స్, ఎయిమ్స్, ఆపీలు సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించాయని, ఈ వర్క్‌షాప్‌లో స్టూడెంట్స్‌కు ప్రాక్టికల్ స్కిల్స్‌ను, మెడికల్ ప్రాక్టీస్‌లో టెక్నిక్స్‌ను సమకూర్చినట్టు డాక్టర్ సతీష్ కత్తుల చెప్పారు. తొలిసారిగా ఆపీ ఫెలోషిప్ అవార్డులను ముగ్గురికి గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో అందజేశామన్నారు.



కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో వైద్యుల బృందం

## ఆన్‌లైన్‌లో సూటు ఎరవేసి రూ.1.21లక్షలు కొట్టేశారు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సూటుబుక్ చేసుకున్న యువకుడు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కాడు. ఆన్‌లైన్ పేమెంట్ విషయంలో గందరగోళానికి గురిచేసి అతడి ఖాతా నుంచి రూ.1.21 లక్షలు కొల్లగొట్టారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ విద్యార్థి సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా 'ఇమ్రాన్ టెక్స్‌టైల్' అనే పేజీ కనిపించింది. దాంట్లో అమ్మకానికి పెట్టిన సూట్ నచ్చడంతో అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశా డు. పేమెంట్ లింక్ పంపించడంతో సూటు ధర అయిన రూ.1900 ఆన్‌లైన్‌లో చెల్లించాడు. తర్వాత లైన్‌లోకి వచ్చిన వ్యక్తులు సూటు, డెలివరీ ధరలకు వేర్వేరుగా పేమెంట్ చెప్పడంతో మరోసారి డబ్బులు పంపించాడు. దీంతో సైబర్ నేరగాళ్లు మొదటిసారి చేసిన డబ్బులు పంపిస్తామని చెప్పి ఓ లింక్ పంపించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేయగా.. అతడిని మభ్యపెట్టి మూడు విడతల్లో రూ.1.21 లక్షలు కాజేశారు.

## ఉమేష్ చంద్రకు ఘన నివాళి

అమీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర సేవలు మరువలేనివని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎస్ఆర్‌నగర్ కూడలిలోని ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఉమేష్ చంద్ర తండ్రి చదలవాడ వేణుగోపాల్ రావు, సామాజిక వేత్త మధుసుధన్ రావు, టిల్లుబాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌నగర్‌లోని ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

## టపాసుల దుకాణాలకు అనుమతులు తీసుకోవాలి

తిరుమలగిరి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రాకర్స్ షాపులకు యజమానులు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు సోమవారం తెలిపారు. అనుమతులు లేకుండా క్రాకర్స్ షాపులను ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రాకర్స్ షాపు వద్ద సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. దుకాణాలకు మధ్య కొంత దూరం పాటించాలని తెలిపారు. విద్యుత్ షాట్‌సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి సోమవారం మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతున్నాడు. వెనుక నుంచి రైలు ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలపాలై రైలు పట్టాల సమీపంలో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొద్ది గంటల్లోనే మరణించాడు. ఈ వ్యక్తి ఆచూకీ, వివరాలు తెలియలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## తల్లీకుమారుడు అదృశ్యం


కుమారుడు అభిరామ్, తల్లి రూప (ఫైల్)

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం పెట్టి కుమారుడిని తీసుకుని తల్లి వెళ్లిపోయిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సబిత తెలిపిన వివరాల ప్రకారం.. బసవరాజుల రూప(36) కుమారుడు అభిరామ్(09)తో కలిసి సీతాఫల్‌మండి ఇందిరానగర్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. భర్త రాజుకు అనారోగ్యంగా ఉండటంతో వరంగల్‌లో ఉంటున్నాడు. కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో నివాసముంటున్న కోడలు ఆర్.కవిత ఆదివారం తన అత్త రూపను చూడటానికి ఇందిరానగర్‌కాలనీకి వచ్చింది. రూప ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇంటి యాజమానిని అడిగింది. మూడు నెలల నుంచి ఇంటికి తాళం వేసి ఉందని, అద్దె కూడా చెల్లించలేదని, కనీసం రూప సెల్‌ఫోన్ నెంబర్ కూడా లేదని కవితకు తెలిపాడు. దీంతో ఆదివారం రాత్రి తన అత్త రూప, ఆమె కుమారుడు కనిపించటం లేదని చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసును నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వారాసిగూడలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశం

## పరుపులు కుట్టే షాపులో స్వల్ప అగ్నిప్రమాదం

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ ప్రధానరహదారి పక్కన ఉన్న పరుపులు, దిండ్లు కుట్టే షాపులో సోమవారం సాయంత్రం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్‌సర్క్యూట్‌తో షాపులో మంటలు రావటంతో అక్కడ ఉన్న జలమండలి ఎయిర్ టెక్‌మిషన్ ద్వారా మంటలను అదుపు చేశారు. స్థానికులు ముందుగానే పరుపులు, దిండ్లను బయటకు తీసివేశారు. అగ్నిమాపకశాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అగ్నిప్రమాద ఘటనతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి


వినయ్ నిషాద్ మృతదేహం

మారేడుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ దుమారికాస్ గోరఖ్‌పూర్‌కు చెందిన వినయ్ నిషాద్(18) జీవనోపాధి కోసం నగరానికి రెండు సంవత్సరాల క్రితం వలసొచ్చాడు. వెస్ట్ మారేడుపల్లిలోని సలాస్కర్ అపార్ట్‌మెంట్‌లో కార్పెంటర్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇనుప నిచ్చెనపై నిలబడి పనిచేస్తున్నాడు. ఈ సమయములో విద్యుత్ వైరుతెగి ఇనుప నిచ్చెనపై పడింది. దీంతో వినయ్ నిషాద్ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అతన్ని సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సరియైన జాగ్రత్తలు పాటించకుండా కార్మికులతో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ దినేష్‌పై 106 బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# డేంజర్ టర్నింగ్స్

సికింద్రాబాద్ నుంచి జామై ఉస్మానియాకు వెళ్లే ప్రధాన రహదారిలో టర్నింగ్‌లు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఈ మూలమలుపులతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం మూలమలుపుల వద్దనైనా రోడ్లను విస్తరించాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను స్థానికులు, ప్రయాణి కులు, వాహనదారులు కోరుతున్నారు.

- మూలమలుపుల్లో వాహనాలు వెళ్లాలంటే నరకమే
- ప్రమాదకరంగా సీతాఫల్‌మండి, వారాసిగూడ, ఆర్ట్స్‌కాలేజీ వద్ద మలుపులు


వారాసిగూడ చౌరస్తా మూలమలుపులో ఎదురెదురుగా ఆర్టీసీ బస్సులు

బౌద్ధనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో మూడుచోట్ల మూలమలుపుల రోడ్లు అతిప్రమాదకరంగా ఉన్నాయి. సీతాఫల్‌మండి చౌరస్తా, వారాసిగూడ చౌరస్తా, ఆర్ట్స్‌కాలేజీ టర్నింగ్ పాయింట్ వద్ద ఉన్న మూలమలుపులతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతోపాటు ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని డ్రైవర్లు, వాహనదారులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం అయితే ఈ మూలమలుపుల వద్ద ట్రాఫిక్ రద్దీ భారీగా ఉంటుంది. దీంతోపాటు రోడ్డు ఇరుక్కుగా ఉండటం, ఆటోలు, తదితర వాహనాలను మూలమలుపుల్లో పార్కింగ్ చేయటంతో సమస్య మరింత జఠిలంగా ఉంటుంది. దీంతో మూలమలుపుల్లో ఆర్టీసీ బస్సులు నడపాలంటే చాలా ఇబ్బందులు పడాల్సివస్తుందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డును ఆక్రమించి తోపుడుబండ్లు..

వారాసిగూడ చౌరస్తాలోని టర్నింగ్‌లో రోడ్డును ఆక్రమించి పూలబండ్లు, టిఫిన్‌బండ్లు నిలపడంతో ట్రాఫిక్‌కు విపరీతంగా అంతరాయం కలుగుతోంది. వారాసిగూడ చౌరస్తాలో కౌసర్‌మసీదుకు వెళ్లే రహదారిలో రోడ్డుమీద ఒకపక్క పూలబండి, మరో పక్క ఆటోల పార్కింగ్‌స్థలం ఉండటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ట్రాఫిక్ పోలీసులు చాలాసార్లు వీటిని తొలగించాలని కోరినా వారు తమ పలుకబడితో ప్రజాపతినిధుల నుంచి ఫోన్‌చేయిస్తున్నారు. వీటితోపాటు వారాసిగూడ చౌరస్తాలో రెండు వైన్స్‌లు ఉన్నాయి. దీంతో వైన్స్‌కు వచ్చేవారు రోడ్లమీదే వాహనాలను నిలుపుతున్నారు. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌తో నరకం అనుభవిస్తున్నామని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

### ఇష్టారాజ్యంగా ఆటోలు..

వారాసిగూడ చౌరస్తా నుంచి సికింద్రాబాద్ స్టేషన్ వరకు ప్రతిరోజూ వందలాది సర్వీస్ ఆటోలు తిరుగుతుంటాయి. ప్రయాణికులను ఎక్కించుకోవటం కోసం ఆటోడ్రైవర్లు పోటాపోటీగా మూలమలుపుల్లోనే ఆటోలను నిలుపుతూ ఇతర వాహనాదారులను ఇబ్బంది పెడుతున్నారు. ఇక్కడ కనీసం ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మూలమలుపుల్లో సర్వీస్ ఆటోల నియంత్రణలో ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు ఈ ప్రాంతంలో ఆటోడ్రైవర్లను కౌన్సిలింగ్ చేస్తున్నా సమస్య మాత్రం ఎప్పటిలాగే ఉంటుంది.

### ప్రత్యేక దృష్టి సారించాలి



మూలమలుపులపై ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు ప్రత్యేకదృష్టి సారించాలి. ప్రజలు పలుమార్లు మూలమలుపులను విస్తరించాలని విజ్ఞప్తులు చేసినా, వినతిపత్రం సమర్పించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా మూలమలుపులను విస్తరించాలి.

- వల్లారపు శ్రీనివాసకుమార్, టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి

### ఆటోలను నియంత్రించాలి



ఈ మూలమలుపుల్లో ఆటోలను నియంత్రిస్తే కొద్దిగా ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది. మహిళలు, వృద్ధులు, పిల్లలు, పాదచారులు మూలమలుపుల్లో రోడ్డు దాటాలంటే చాలా అవస్థలు పడుతున్నారు. మూలమలుపుల వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

- ఆనంద్, బౌద్ధనగర్

### ఈ టర్నింగుల్లో డ్రైవింగ్ కష్టమే..

ఈ మూలమలుపుల్లో బస్సులు, పెద్ద వాహనాలు నడపాలంటే కష్టమేనని డ్రైవర్లు వాపోతున్నారు. సీతాఫల్‌మండి చౌరస్తా, వారాసిగూడ చౌరస్తా, ఆర్ట్స్‌కాలేజీ టర్నింగ్ పాయింట్లు ఆర్టీసీ డ్రైవర్లకు నరకంగా మారాయి. ఉదయం, సాయంత్రం, రద్దీవేళ్లలో ఈ మూలమలుపుల్లో ఆర్టీసీ బస్సులు ఎదురెదురు పడితే డ్రైవర్లకు యముడే కనిపిస్తాడు. ద్విచక్ర వాహనాదారులు ఈ బస్సుల మధ్య నుంచే వెళ్లతుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని డ్రైవర్ల ఒత్తిడికి గురవుతున్నారు. ఈ మూలమలుపుల్లో ఆటోలను నిలపటంతో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. వారాసిగూడ నుంచి ఆర్ట్స్ కాలేజీ టర్నింగ్ పాయింట్ వరకు ప్రధాన రహదారిలో ప్రతి శుక్రవారం సాయంత్రం కూరగాయల సంతను నిర్వహిస్తున్నారు. దీంతో కూడా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. రోడ్డు విస్తరణ చేస్తామని 20 సంవత్సరాల నుంచి పలుమార్లు మార్కింగ్ వేసినా అవి అమలులోకి నోచుకోవటం లేదు.

## అయ్యప్ప మాలధారణతో క్రమశిక్షణ


పాదయాత్రను ప్రారంభిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


అయ్యప్ప స్వాములతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారణతో దైనందిన జీవితంలో క్రమశిక్షణ ఏర్పడుతుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప మాలధారుల యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆలయంలో వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1,230 కిలోమీటర్ల దూరం ఉన్న శబరిమలకు కఠోర దీక్షతో వెళ్తున్న 120 మంది అయ్యప్ప మాలధారుల పాదయాత్ర సాహసోపేతమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఆకుల హరికృష్ణ, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

### శిక్షలు కఠినంగా ఉండాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

నేరాలు చేయడానికి భయపడేలా కఠినంగా శిక్షలు ఉండాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ నుంచి అయ్యప్ప మాలధారులు పాదయాత్రగా శబరిమలకు వెళ్తుండటంతో నిర్వహించిన పూజలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎవరైనా నేరం చేయాలంటే భయపడేలా, వెంటనే శిక్ష పడేలా చట్టాలలో మార్పు చేయాలని అన్నారు. ఇటీవల ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసం బాధాకరం అని అన్నారు. నిందితుడు మహారాష్ట్రలో ఇలాంటి తరహా సంఘటనలకు పాల్పడ్డాడని, అతనిపై అప్పుడే చర్యలు తీసుకుంటే ఈ సంఘటన జరిగేది కాదని అన్నారు. మహిళలపై ఆత్యాచారాలు, దాడుల జరిగినపుడు హడావిడి చేయడం కాదు పునావృతం కాకుండా నూతన చట్టాలను తీసుకురావాలని ఆయన కోరారు.

## ఉమేష్ చంద్ర సేవలు మరువలేనివి : ఏసీపీ


ఎస్ఆర్‌నగర్‌లోని ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

అమీర్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగాన్ని పట్టుదలతో నిర్వర్తిస్తూ అసాంఘీక శక్తుల చేతిలో అసువులు బాసిన దివంగత మాజీ ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర సేవలు మరువలేనివని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎస్ఆర్‌నగర్ కూడలిలోని ఉమేష్ చంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కత్తిమీద సాములాంటి పోలీస్ ఉద్యోగాన్ని కర్తవ్యంతో నిర్వహించిన ధీశాలి ఉమేష్ చంద్ర అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిరంతరం శ్రమిస్తూ క్రింది స్థాయి అధికారులు, సిబ్బందిలో మనోధైర్యాన్ని నింపిన గొప్ప అధికారి ఉమేష్ చంద్ర అన్నారు. ప్రస్తుతం ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన ఆశలు, ఆశయాలు కళ్లముందే కదలాడుతున్నాయన్నారు. ఉమేష్ చంద్రను ఆదర్శంగా తీసుకుని పోలీసు అధికారులు, సిబ్బంది ముందుకు నడువాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఉమేష్‌చంద్ర తండ్రి చదలవాడ వేణుగోపాల్ రావు, సామాజికవేత్త మధుసూదన్ రావు, టిల్లుబాయ్ పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ఆదాయం రూ.2.57 లక్షలు


హుండీలో కానుకలను లెక్కిస్తున్న దేవాలయ శాఖ అధికారులు, అర్చకులు, భక్తులు

మారేడుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలోని ఐదు హుండీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. నాలుగు నెలలకు సంబంధించి, హుండీల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.2.57లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఆండాలు, ఆలయ ఈఓ అరుణ కుమారి, ప్రధానార్చకులు రాజేశ్వర్‌శర్మ, ఆనంద్, యుగేందర్, శ్రీవాత్సవ, మాజీ ధర్మకర్తలు నాగేందర్ యాదవ్, నర్సింగ రావు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరానగర్ బస్తీలో సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్ల పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ ఇందిరానగర్ (లిటిల్ ఫ్లవర్ స్కూలు ఎదురుగా) సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ అడ్డగుట్ట డివిజన్ నేతలు సోమవారం ప్రారంభించారు. బస్తీలో అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గణేష్‌యాదవ్, దొమ్మాటి శివకుమార్, టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్, రాము, కోటీ, ఉపేందర్, వెంకట్, తిరుమలేష్, శాంతిరాజ్, మాణిక్, రామలీల, లలితలు కలిసి ప్రజాసమస్యల్ని అడిగి తెలుసుకునేందుకు బస్తీలో పర్యటించారు. డివిజన్‌లో చాలా పెండింగ్ పనులు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఇదే డివిజన్‌లో మరోచోట సీసీరోడ్డు పనులు ప్రారంభించగా కాంగ్రెస్ నేతలు వస్తున్నారన్న సమాచారం తెలుసుకుని లిటిల్ ఫ్లవర్ స్కూలు ఎదురుగా సీసీరోడ్డు పనులను ప్రారంభించకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. కార్పొరేటర్ కోసం దాదాపు 2 గంటల పాటు వేచి ఉన్నప్పటికీ రాకపోవడంతో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సలీం అనుమతితో కాంగ్రెస్ నేతలు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అక్కడి నుంచి కాంగ్రెస్ నేతలు ఇందిరానగర్ బస్తీలో పర్యటించి ప్రజా సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, టిప్పు, నబి పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతాం

అడ్డగుట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌లోని ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భరత్ కుమార్ తెలిపారు. సోమవారం అడ్డగుట్ట డివిజన్‌లోని లాలాపేట్ ఇందిరానగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో కాంగ్రెస్‌నేతలతో కలిసి ఆయన పర్యటించారు.

డివిజన్‌లో చాలాచోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఈ సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివకుమార్‌తో పాటు ఇందిరానగర్ బస్తీ, లాలాపేట్ బస్తీ నాయకులు పాల్గొన్నారు.

## 'రాజీవ్ రహదారి విస్తరణ వంద అడుగులకే కుదించాలి'



ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న స్థానికులు

సికింద్రాబాద్/ మారేడుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రహదారి విస్తరణను 100 అడుగులకు కుదించాలంటూ రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో కార్ఖానా, తిరుమలగిరి ప్రాంతాల స్థానికులు, వ్యాపారులు ఆందోళన నిర్వహించారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రహదారిని 200 అడుగులకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని, దాన్ని 100 అడుగులకు కుదించాలని ప్లకార్డులతో కార్ఖానా కేఎఫ్‌సీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ విషయమై సీఎం పునరాలోచించాలని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే, మల్కాజిగిరి ఎంపీ చొరవ తీసుకోవాలని జేఏసీ కన్వీనర్ సతీశ్‌గుప్తా కోరారు.

## ఆన్‌లైన్‌లో సూటు ఎరవేసి రూ.1.21లక్షలు కొట్టేశారు

- ఆన్‌లైన్‌లో కొనే ప్రయత్నం చేసి మోసపోయిన విద్యార్థి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో సూటుబుక్ చేసుకున్న యువకుడు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కాడు. ఆన్‌లైన్ పేమెంట్ విషయంలో గందరగోళానికి గురిచేసి అతడి ఖాతా నుంచి రూ.1.21 లక్షలు కొల్లగొట్టారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ విద్యార్థి సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా 'ఇమ్రాన్ టెక్స్‌టైల్' అనే పేజీ కనిపించింది. దాంట్లో అమ్మకానికి పెట్టిన సూట్ నచ్చడంతో అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. పేమెంట్ లింక్ పంపించడంతో సూటు ధర అయిన రూ.1900 ఆన్‌లైన్‌లో చెల్లించాడు. ఆ తర్వాత లైన్‌లోకి వచ్చిన వ్యక్తులు సూటు, డెలివరీ ధరలకు వేర్వేరుగా పేమెంట్ చెప్పడంతో మరోసారి డబ్బులు పంపించాడు. దీంతో సైబర్ నేరగాళ్లు మొదటిసారి చేసిన డబ్బులు పంపిస్తామని చెప్పి ఓ లింక్ పంపించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేయగా.. అతడిని మభ్యపెట్టి మూడు విడతల్లో రూ.1.21 లక్షలు కాజేశారు.

## గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్కాజిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో ఉన్న ఓ వ్యక్తి కూరగాయలు కట్‌చేసే కత్తితో తన గొంతుకోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మల్కాజిగిరి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణుపురికి చెందిన చెన్నంశ్రీను (55) పది సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి తాగిన మత్తులో ఉన్న ఆయన ఇంట్లో భార్య పిల్లలు లేని సమయంలో తన గొంతును కత్తితో పొడుచుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లి మందలించడంతో కుమారుడు అదృశ్యం

జవహర్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏ పని చేయడం లేదని తల్లి కుమారుడిని మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డు సులోచన తన భర్త, కుమారుడు, కుమార్తెతో కలిసి కౌకూర్ బార్లపేటలో నివాసం ఉంటుంది. కుమారుడు జానీ అలియాస్ దినేశ్ (20) ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉండటంతో తల్లి కుమారుడిని మందలించింది. దాంతో ఈనెల 20న తన మొబైల్ ఇంట్లోనే పెట్టి దినేశ్ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సోమవారం కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసున్నారు.

## జేఎన్‌టీయూ ప్రొఫెసర్లకు ఘన సన్మానం


ప్రొ.శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెండు యూనివర్సిటీలకు ఉపకులపతులుగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్లను వర్సిటీ ఉద్యోగులు, అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. పాలమూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన జీఎన్.శ్రీనివాస్‌ను వర్సిటీ ఉద్యోగుల సంఘం నేతలు ఘనంగా సన్మానించగా, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ (ఆర్‌జేయూకేటీ) ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొ.గోవర్ధన్‌కు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పూలమొక్కను అందించి సత్కరించారు.

### ప్రొ.గోవర్ధన్‌కు అభినందనలు

కేపీహెచ్‌బీకాలనీ: బాసర ఆర్‌జేయూకేటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను సోమవారం వర్సిటీ జేఏసీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పవన్‌కుమార్, ఉదయ్, తేజ, గోపీనాథ్, శ్రావణ్, శ్రావణి, లిఖిత, ప్రజ్ఞ పాల్గొన్నారు.

### ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌కు..

పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జేఎన్‌టీయూ ప్రొఫెసర్ జీఎన్.శ్రీనివాస్‌ను సోమవారం ఆయన వద్ద పీహెచ్‌డీ చేసిన వారు శాలువాతో సత్కరించి అభినందించారు. డా.జగదీష్‌కుమార్, డా.రాజు, కె.నరేష్, డా.చంద్రమౌళి, సయ్యద్ అహ్మద్ తదితరులు ఉన్నారు.